# కామ్రేడ్ జానకి రామ్...... సంచలన అరంగేట్రం



## అసిస్టెంట్ డైరెక్టర్ నుంచి డైరెక్టర్‌గా.. 'కామ్రేడ్ కళ్యాణ్'తో సాలిడ్ ఎంట్రీ

24 క్రాఫ్ట్స్‌పై పట్టు..

వైవిధ్యమైన కథలకు,దిగ్గజ దర్శకులతో పనిచేసిన అనుభవం..

కామెడీకి తనదైన శైలిని జోడించి ..

ట్రైలర్‌తోనే ఆకట్టుకున్న దర్శకుడు జానకి రామ్ మారెళ్ల








హీరోయిన్ మహిమ నంబియార్ తో జానకి రామ్ మారెళ్ల

సినిమా అంటే కేవలం ఒక కథను తెరకెక్కించడం మాత్రమే కాదు.. కథకు తగ్గట్టుగా ప్రతి క్రాఫ్ట్‌ను సమన్వయం చేస్తూ ప్రేక్షకుడిని థియేటర్‌లో కూర్చోబెట్టేలా చేయడం. అలాంటి అనుభవాన్ని ఎన్నో సినిమాల్లో అసిస్టెంట్ డైరెక్టర్‌గా, కోడైరెక్టర్‌గా పనిచేస్తూ సంపాదించుకున్నారు దర్శకుడు జానకి రామ్ మారెళ్ల.

వైవిధ్యమైన కథలతో పాటు దిగ్గజ దర్శకుల దగ్గర పనిచేసి సినిమా నిర్మాణంలోని 24 క్రాఫ్ట్స్‌పై అవగాహన పెంచుకున్న జానకి రామ్.. ఇప్పుడు దర్శకుడిగా తన అదృష్టాన్ని పరీక్షించుకోవడానికి ఎంచుకున్న కథ 'కామ్రేడ్ కళ్యాణ్'.

చాలాకాలంగా టచ్ చేయని ఒక కథకు హాస్యాన్ని జోడించి, ప్రేక్షకులకు సరికొత్త అనుభూతిని అందించే ప్రయత్నం చేసినట్లు ట్రైలర్ చూస్తే అర్థమవుతోంది.

ముఖ్యంగా ట్రైలర్‌లోని కామెడీ సన్నివేశాలు ప్రేక్షకులను కడుపుబ్బ నవ్వించేలా ఉన్నాయి. ప్రతి పాత్రకు తగిన కామెడీ టైమింగ్‌ను సెట్ చేయడంలో దర్శకుడి అనుభవం స్పష్టంగా కనిపించింది.

### కోన వెంకట్ పేరు.. కామెడీపై నమ్మకం!

కోన వెంకట్ పేరు వినగానే తెలుగు ప్రేక్షకులకు ముందుగా గుర్తొచ్చేది హాస్యం పండించే కథలు, వినోదాత్మక స్క్రీన్‌ప్లే. గతంలో పోస్టర్‌పై 'కోన వెంకట్ కథ' అనే మాట కనిపిస్తే సినిమాపై ఒక రకమైన నమ్మకం ఏర్పడేది.

అలాంటి కోన వెంకట్ ప్రెజెంటర్‌గా 'కామ్రేడ్ కళ్యాణ్'కు ఉండటం సినిమాపై ఆసక్తిని మరింత పెంచుతోంది. కథలోని కామెడీని, పాత్రల మధ్య టైమింగ్‌ను, సన్నివేశాల రూపకల్పనను ట్రైలర్‌లో చూస్తుంటే ఈ కాంబినేషన్‌పై పెట్టుకున్న అంచనాలకు తగ్గట్టుగానే దర్శకుడు జానకి రామ్ మారెళ్ల న్యాయం చేసేదని అర్థమవుతోంది.సినిమా పక్కాగా ప్రేక్షకులకు కావాల్సినంత హాస్యం ఉండబోతుందనే కాన్ఫిడెన్స్ కల్పించారు దర్శకులు

### వచ్చాడు....హిట్ కొడతాడు... వెలతాడు...

శ్రీవిష్ణు సినిమా అంటే.. అంచనాలు మామూలుగా ఉండవు!వస్తాడు హిట్ కొడతాడు వెళతాడు అంటూ సోషల్ మీడియాలో కామెంట్లు హోరెత్తాయి

'సామజవరగమన' వంటి చిత్రాలతో తనదైన కామెడీ టైమింగ్‌తో ప్రేక్షకులను ఆకట్టుకున్న హీరో శ్రీవిష్ణు సినిమా అంటేనే ప్రేక్షకుల్లో ప్రత్యేకమైన అంచనాలు ఉంటాయి.

ఆ అంచనాలను ఏమాత్రం తగ్గించకుండా.. ఈ సినిమాలో తెలుగు సినిమాకు సుపరిచితమైన పలువురు హాస్యనటులతో తనదైన కామెడీ టైమింగ్‌ను దర్శకుడు జానకి రామ్ మారెళ్ల సెట్ చేసిన తీరు ట్రైలర్‌లో ఆకట్టుకుంది.

ట్రైలర్ చూసిన తర్వాత "ఇది కదా కావాల్సింది" అనే కాన్ఫిడెన్స్ ప్రేక్షకుల్లో కలిగేలా చేయడంలో దర్శకుడు సక్సెస్ అయ్యారని చెప్పొచ్చు.

### ఒక్కో మెట్టు ఎక్కి.. దర్శకుడిగా!

జానకి రామ్ మారెళ్లది గోల్డెన్ స్పూన్‌తో వచ్చిన ప్రయాణం కాదు. అసిస్టెంట్ డైరెక్టర్‌గా మొదలుపెట్టి.. దర్శక విభాగంలో అన్ని క్రాఫ్ట్స్ లో అనుభవం సంపాదించుకుని కో డైరెక్టర్ గా ఎన్నో సినిమాలకు పనిచేస్తూ.. సినిమా మేకింగ్‌లోని ప్రతి అంశాన్ని దగ్గరగా పరిశీలిస్తూ ఒక్కో మెట్టు ఎక్కి దర్శకుడి స్థానానికి చేరుకున్నారు.

దిగ్గజ దర్శకుల దగ్గర పనిచేసిన సుదీర్ఘ అనుభవం, 24 క్రాఫ్ట్స్‌పై సంపాదించిన అవగాహన 'కామ్రేడ్ కళ్యాణ్' ట్రైలర్‌లో కొట్టొచ్చినట్టు కనిపిస్తోంది.

ఏది ఏమైనా.. దర్శక విభాగంలో దర్శకుడిగా మారిన జానకి రామ్ మారెళ్లకు 'కామ్రేడ్ కళ్యాణ్' ఒక కీలకమైన అడుగు. ట్రైలర్‌తోనే తనపై ఒక నమ్మకాన్ని కలిగించిన ఆయన..సినిమాతోనూ అదే స్థాయిలో ఆకట్టుకుని హిట్ అందుకుంటే, ఇండస్ట్రీలో ఎంతోమంది కొత్త దర్శకులకు ఆయన ప్రయాణం ఒక మార్గదర్శకంగా నిలుస్తుందనడంలో అతిశయోక్తి లేదు.



హీరో శ్రీ విష్ణు తో జానకి రామ్ మారెళ్ల

---

## రైతుల కొనుగోళ్లకు అడ్డంకులపై విచారణ జరపాలి

**నిజామాబాద్, అక్టోబర్ 07 (డీడీ9 వార్త):**

రైతులు పండించిన ధాన్యానికి మెరుగైన ధర లభించే అవకాశం ఉన్నప్పుడు కొనుగోళ్లకు అడ్డంకులు ఏర్పడితే రైతులే నష్టపోతారని తెలంగాణ రక్షణ సేన జిల్లా అధ్యక్షుడు నవీన్‌రెడ్డి అన్నారు. బోధన్, నవీపేట్, ఆర్మూర్ నియోజకవర్గాల పరిధిలోని నందిపేట్, మాక్లూర్ ప్రాంతాల్లో మహారాష్ట్రకు చెందిన వ్యాపారులు రైతుల నుంచి ధాన్యం కొనుగోలు చేస్తున్నారని తెలిపారు. అయితే వారిని బెదిరించి కొనుగోళ్లు నిలిపివేసేలా చేస్తున్నారనే ఆరోపణలు రైస్ మిల్లర్స్ అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వడ్డీ మోహన్‌రెడ్డిపై ఉన్నాయని పేర్కొన్నారు. ఈ ఆరోపణల్లో వాస్తవమెంత అన్నది అధికారులు సమగ్రంగా విచారించి తేల్చాలని డిమాండ్ చేశారు. మహారాష్ట్ర వ్యాపారుల రాకతో రైతులకు మెరుగైన ధర లభించే అవకాశం ఉంటే, కొనుగోళ్లను అడ్డుకోవడం వల్ల రైతులకు నష్టం వాటిల్లే పరిస్థితి ఏర్పడుతుందన్నారు. రైతు తన పంటను ఎక్కడ, ఎవరికి, ఏ ధరకు విక్రయించాలో నిర్ణయించుకునే స్వేచ్ఛ ఉండాలని స్పష్టం చేశారు. రైతుల ప్రయోజనాలను కాపాడాల్సిన బాధ్యత జిల్లా యంత్రాంగంతో పాటు ప్రజాప్రతినిధులు, రాజకీయ నాయకులపై ఉందన్నారు. రైతుల సమస్యలపై జిల్లా నాయకులు ఏం చేస్తున్నారని ప్రశ్నించారు. అధికారులు వెంటనే స్పందించి వాస్తవాలను వెలుగులోకి తీసుకురావడంతో పాటు రైతులకు న్యాయం జరిగేలా చర్యలు తీసుకోవాలని నవీన్‌రెడ్డి డిమాండ్ చేశారు.



## వీడీసీల పేరుతో అరాచకాలకు తావులేదు

- **సామాజిక బహిష్కరణలపై కఠినంగా వ్యవహరించాలి: బీసీ కమిషన్ చైర్మన్ జి.నిరంజన్**

**నిజామాబాద్, అక్టోబర్ 07 (డీడీ9 వార్త):**

గ్రామాల అభివృద్ధి కమిటీల పేరుతో ప్రజలను సామాజిక బహిష్కరణలు, జరిమానాలతో వేధించే చర్యలకు తావులేదని రాష్ట్ర బీసీ కమిషన్ చైర్మన్ జి.నిరంజన్ స్పష్టం చేశారు. చట్టాన్ని అతిక్రమించే వీడీసీలపై కఠిన చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. జిల్లాలో సామాజిక బహిష్కరణలకు గురైన బాధితుల సమస్యలను తెలుసుకునేందుకు జి.నిరంజన్ నేతృత్వంలోని బీసీ కమిషన్ సభ్యులు తిరుమలగిరి సురేందర్, రాపోలు జయప్రకాశ్, బాలలక్ష్మి బుధవారం నిజామాబాద్‌లోని సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలో బాధితులతో సమావేశమయ్యారు. వివిధ గ్రామాలకు చెందిన సుమారు 90 మంది బాధితులు కమిషన్‌ను కలిసి తమ సమస్యలను వివరించి లిఖిత పూర్వకంగా అర్జీలు సమర్పించారు. అనంతరం కలెక్టర్ ఇలా త్రిపాఠితో కలిసి రెవెన్యూ, పోలీసు అధికారులతో కమిషన్ సమీక్ష నిర్వహించింది. బహిష్కరణలు చోటుచేసుకున్న గ్రామాల్లో పరిస్థితులు, వీడీసీలపై తీసుకున్న చర్యలను అధికారులు వివరించారు. గ్రామాల అభివృద్ధి కోసం కమిటీలను ఏర్పాటు చేసుకోవడాన్ని తప్పుపట్టడం లేదని, అయితే వాటి పేరుతో ప్రజలను బహిష్కరించడం, జరిమానాలు విధించడం మాత్రం సహించబోమని జి.నిరంజన్ స్పష్టం చేశారు. వీడీసీలు చట్ట పరిధిలో పనిచేసేలా అదనపు కలెక్టర్, పోలీసు, రెవెన్యూ అధికారులతో ప్రత్యేక కమిటీ ఏర్పాటు చేయాలని జిల్లా యంత్రాంగానికి సూచించారు. బాధితులకు సత్వర న్యాయం అందేలా చర్యలు తీసుకోవాలని, అవసరమైతే ఉచిత న్యాయ సహాయం అందించాలని తెలిపారు. ప్రజల్లో చైతన్యం పెంచేందుకు కళాబృందాల ద్వారా విస్తృత అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు. కలెక్టర్ ఇలా త్రిపాఠి మాట్లాడుతూ సామాజిక బహిష్కరణలను అరికట్టేందుకు జిల్లా యంత్రాంగం పటిష్ట చర్యలు చేపడుతుందని తెలిపారు. కమిషన్ సూచనలను అమలు చేస్తూ చట్టవిరుద్ధ చర్యలకు పాల్పడే వీడీసీలపై చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. బీసీలకు రక్షణ చట్టం: ఎస్సీ, ఎస్టీలకు అట్రాసిటీ చట్టం తరహాలో బీసీల రక్షణ కోసం రాష్ట్ర ప్రభుత్వం త్వరలో బీసీ ప్రొటెక్షన్ యాక్టును అమల్లోకి తీసుకురానుందని జి.నిరంజన్ వెల్లడించారు. ఈ చట్టం అవసరంపై బీసీ కమిషన్ ఇప్పటికే ప్రభుత్వానికి సమగ్ర నివేదిక సమర్పించిందని తెలిపారు. ప్రభుత్వం సానుకూలంగా ఉందని, త్వరలోనే చట్టం అమల్లోకి వస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. సమావేశంలో అదనపు కలెక్టర్ వి.భుజంగరావు, ఆర్మూర్ సబ్ కలెక్టర్ అభిగ్యాన్ మాల్వియ, అదనపు డీసీపీ శుభం నగ్రాలే, డీఆర్వో గీత, ఆర్డీవోలు రాజేంద్రకుమార్, విజయకుమారి, ఏసీపీలు ప్రకాశ్ యాదవ్, వెంకటేశ్వర్‌రెడ్డి, బీసీ కమిషన్ అధికారులు సునీత, ఇర్ఫాన్, సతీష్, జిల్లా బీసీ సంక్షేమ అధికారి సాయికుమార్ తదితరులు పాల్గొన్నారు.








This newspaper/periodical is published by BATHULA KUMAR RAJA from PLOT 620, ROAD NO. 34, SURVEY OF INDIA AYYAPPA SOCIETY, CHANDA NAIK NAGAR, MADHAPUR, RANGAREDDY, TELANGANA - 500204. on behalf of BATHULA KUMAR RAJA, edited by BATHULA KUMAR RAJA and printed by NAGAVARAM SREENIVAS RAO at GARUDA PRINTERS, at H.NO.2-86/1, PLOT NO 26-SP, SY NO 420, SAGAR HIGH WAY, RAGANNAGUDA VILLEGE, ABDULLAPUR MANDAL, RANGAREDDY, TELANGANA - 502510.